ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతాం



మాట్లాడుతున్న చంద్రమోహన్

దిల్‌సుఖ్‌నగర్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం. చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో సీపీఐ(ఎం) పార్టీ 5వ శాఖ మహాసభ నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండా బాట పట్టాలన్నారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకునే నాథులే లేరన్నారు. ఎర్రజెండా పార్టీ మాత్రమే ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. అనంతరం ఎన్టీఆర్‌నగర్ సీపీఐఎం శాఖ కార్యదర్శిగా ఎం. గోపీనాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, శ్రీనివాస్, వీరయ్య, రాజు, పద్మ, వెంకన్న, రాంచందర్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి: సీపీఎం



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్‌బీనగర్: ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య కోరారు. సీపీఎం వనస్థలిపురం శాఖ మహాసభను విజయవంతం చేయాలని ఎన్‌జీఓఎస్ కాలనీ బస్టాప్ వద్ద ఆదివారం పార్టీ జెండాను అవిష్కరించి సీతారాం ఏచూరికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి ఆశయ సాధనాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రైతంగా సాయుధ పోరాటానికి బీజేపీ మతం రంగు పులుముతుందని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అందజేసే వరకు ప్రజల తరఫున పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాశయ్య, సుమన్, లక్ష్మయ్య, రాధమ్మ, భాగ్యమ్మ, కోమలత, యాదయ్య, మహేశ్, అయోధ్య, జలంధర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది


దిల్‌సుఖ్‌నగర్: నవ సమాజ నిర్మాతలే ఉపాధ్యాయులని సిటీ స్మాల్ కాస్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నందికొండ నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం కొత్తపేటలోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం(టీపీయుఎస్) ఆధ్వర్యంలో లీగల్ అవగాహన సదస్సు, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకు ఉంటుందన్నారు. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు వేసిది ఉపాధ్యాయులు మాత్రమే అన్నారు. ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు బాధ్యతతో ఉండి విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి పి. శ్రీదేవి మాట్లాడుతూ.. అందరూ చట్టాలపై అవగహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నర్సింగ్‌రావు

ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజ్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, స్వమేధ ఎడ్యుకేషన్ సర్వీస్ నిర్వాహకులు ఎం.నర్సింహరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ పెద్ది శివప్రసాద్, తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సందీప్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్, కోశాధికారి జార్జ్ పాల్, ఉపాధ్యక్షుడు రాము, జాయింట్ సెక్రటరీ నరేందర్ పాల్గొన్నారు.

ఫతుల్లాగూడ చెరువును సమగ్ర సర్వే చేయండి



ఫతుల్లాగూడ చెరువులోకి తమ ప్లాట్లు రావని చూపిస్తున్న బాధితులు

నాగోలు: అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని ఫతుల్లాగూడ చెరువును సమగ్ర సర్వే చేయాలని, అధికారుల తప్పిదంతో చెరువు స్థలం కన్నా ఎక్కవ ఉన్నట్లు చూపిస్తున్నారని ఫతుల్లాగూడ చెరువు సమీపం సర్వే నెంబర్ 125లోని ప్లాట్లు యజమానులు పేర్కొన్నారు. ఆదివారం ఫతుల్లాగూడ చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సర్వేనెంబర్ 125లో ప్లాట్లు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధికి సంబంధం లేదన్నారు. సర్వే నంబర్‌లోని 36లో ఫతుల్లాగూడ చెరువు ఉంటుందని దాని పక్కనే అబ్దులాపూర్‌మెంట్ మండలం తట్టిఅన్నారం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 125 ఉంటుందన్నారు. గత 30 ఏళ్ల కిందటే సుమారు 1.36 గుంటల్లో తామంతా ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. కొంత మంది అబ్దులాపూర్‌మెంట్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 125 కూడా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని వస్తాయని హైడ్రాకు తప్పడు ఫిర్యాదు చేశారని ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో తప్పుడు ప్రచారం జరుగుతోందని ఉన్నతాధికారులు స్పందించి చెరువు సమగ్ర సర్వే చేసి తమకు న్యాయం చేయాలన్నారు.

అక్కినేని నాగేశ్వరరావు సినీ రంగానికి మూల స్తంభం



మాట్లాడుతన్న రామారావు

నాగోలు: అక్కినేని నాగేశ్వర రావు సినీ రంగానికి ఓ మూల స్తంభం లాంటి వారని సినీ విజ్ఞాన విశారాధ ఎస్‌వీ రామారావు, న్యూ నాగోలు సీనియర్ సిటిజెన్ ఫోరం అధ్యక్షులు కొమర్రాజు జ్ఞానకుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్ సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ స్వరఝరి కల్చరల్ అసోసియేషన్ సౌజన్యంతో అక్కినేని నాగేశ్వర రావు శత జయంతి సంగీత విభావరి నిర్వహించారు . ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నాగేశ్వరరావు తాను అంతగా చదువుకోక పోయినా ఎన్నో విద్యా సంస్థలకు విరాళాలిచ్చి ఎంతో మందికి విద్యనభ్యసించే అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో తాతా హనుమంతరావు, డా.జ్ఞానకుమార్, కాశీనాథ రావు, రవికుమార్, సంగమేశ్వర రెడ్డి, మల్లికార్జునుడు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయండి

మీర్‌పేట: సెప్టెంబరు 30న ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న పీడీఎస్‌యూ 50వ వసంతాల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పీవైఎల్ (ప్రోగ్రెసివ్ యూత్ లీగ్) బాలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూర్ భీమేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలో స్వర్ణోత్సవ సభ వాల్‌పోస్టర్‌లను పీవైఎల్ సభ్యులు ఆవిష్కరించారు. నవ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. పీడీఎస్‌యూ కోట్లాది మంది విద్యార్థులకు మార్గదర్శమైందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కారేమోల రాకేశ్, సభ్యులు శంకర్, మహేశ్, చాగంటి ప్రవీణ్, నరేందర్, ప్రవీణ్, జగదీశ్, వసంత్, అరుణ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఆహ్లాదం పంచాల్సిన చెరువులు ప్రజాప్రతినిధులు, సర్కిల్ అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడదూరంలో ఆగిపోతున్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో స్వచ్ఛమైన నీటితో కళకళలాడాల్సిన చెరువులు మురికి కుంటల్లా మారుతున్నాయి. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు కబ్జాలకు తెర లేపుతున్నారు. చెరువులన్నీ దుర్గంధంగా మారుతుండటంతో పరిసర వాసులు దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరై అనారోగ్యాలకు గురవుతున్నామని వాపోతున్నారు.

–చంపాపేట



మురుగునీటి కాసారంగా మారిన బైరామల్‌గూడ చెరువు

సుందరీకరణ కరువై..
కబ్జాలకు నెలవై..

- మురికి కుంటలా బైరామల్‌గూడ చెరువు
- మాంసపు వ్యర్థాలు, అండర్ డ్రైనేజీ మురుగు అందులోనే..
- పర్యవేక్షణ లేక దుర్గంధంగా మారుతున్న వైనం

ఒకప్పటి కర్మన్‌ఘాట్ గ్రామపంచాయతీ పరిధిలోని బైరామల్‌గూడ చెరువు సర్వే నెంబర్ 16లో 6 ఎకరాల 25 కుంటల విస్తీర్ణంతో మంచినీటితో తొణికిసలాడుతూ చెరువు శిఖం, మరో మూడు ఎకరాలు బఫర్ జోన్ మొత్తం 9 ఎకరాలు కలిగి ఉండేది. గతంలో చెరువు లోతట్టు ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రానికి చెరువు నుంచి కాలువలు తవ్వి, వ్యవసాయదారులు సేద్యం చేస్తుండేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జనాభా, నగర విస్తీర్ణత పెరగడంతో ఆ చెరువు పరిసరాలు కాస్తా కాంక్రీట్ జంగిల్‌గా మారాయి. వ్యవసాయ క్షేత్రాలు నూతన కాలనీలుగా రూపుదిద్దుకున్నాయి. దీంతో చినుకులు పడితే చాలు చెరువు ఎగువ కాలనీలైన బీఎన్‌రెడ్డి, డిఫెన్స్, రెడ్డి కాలనీ మాధవనగర్ వంటి పలు ప్రాంతాల మీదుగా వరదనీటిని చెరువుకు మోసుకువచ్చే డొంకలు, వాగులు, పిల్ల కాలువలు కనుమరుగయ్యాయి. దీంతో రెండు దశాబ్దాలుగా చెరువుకు నీరు వచ్చే మార్గం లేక లోతట్టు కాలనీలన్నీ జలమయంగా మారడం పరిపాటిగా మారింది.

అర్ధాంతరంగా సుందరీకరణ పనులు

బీడుగా మారిన చెరువు స్థలంపై కబ్జాదారుల కన్ను పడి తొమ్మిది ఎకరాల చెరువు కాస్తా రెండు ఎకరాలకు కుంచించుకుపోయింది. అది చాలదన్నట్లు పరిసర కాలనీవాసులు అండర్ డ్రైనేజీ నాలాలను మిగిలిన చెరువులోకి వదిలివేయడమే కాకుండా మాంసం వ్యర్థాలు, చెత్తా చెదారం ఆ ప్రాంతంలో డంపింగ్ చేయడంతో అది కాస్తా మురికి నీటి కాసారంగా మారింది. దీంతో పరిసర కాలనీవాసులు పందులు, దోమల సైర్వ విహారాలతో ముక్కుపుటలదిరే దుర్గంధం నడుమ అనారోగ్యం పాలవుతున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం చెరువు సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి కొంతమేర పనులు కూడా ప్రారంభించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు ఉదాసీనత, అధికారుల నిర్లక్ష్యంతో సుందరీకరణ పనులు కూడా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సర్కిల్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి చెరువు స్థలాన్ని సంరక్షించి పూర్తిస్థాయిలో సుందరీకరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హైడ్రా అధికారుల పరిశీలన..

చెరువు శిఖం, బఫర్‌జోన్ల సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి అధికారాలతో హైడ్రాను రూపకల్పన చేశారు. చెరువు పరిసర కాలనీవాసులు హైడ్రా అధికారులను కలిసి కబ్జా విషయంపై పలుమార్లు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో సదరు అధికారులు చెరువు కబ్జా స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించటం కూడా జరిగింది. మరి హైడ్రా అధికారులు బైరామల్‌గూడ చెరువు కబ్జాదారులపై ఎలాంటి చర్యలు చేపట్టి చెరువు స్థలాన్ని కాపాడుతారో అని స్థానికులు చర్చించుకుంటున్నారు.



చెరువు స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు(ఫైల్)

సుందరీకరణ చేపట్టాలి..



గతంలో చెరువు బఫర్ జోన్‌తో కలిసి రెవెన్యూ, ధరణి రికార్డుల ఆధారంగా సుమారు 9 ఎకరాల వరకు ఉండేది. ఆక్రమణదారుల కన్నుపడి సుమారు మూడు ఎకరాలకు కుంచించుకుపోయి మురుగు నీటి కుంటగా మారింది. వరదనీరు చెరువుకు చేరే మార్గం లేక లోతట్టు కాలనీలు చినుకులు పడితే నీట మునుగుతాయి. ఈ విషయమై హైడ్రా అధికారులకు కూడా ఫిర్యాదు చేశాం. చెరువు స్థలాన్ని స్వాధీనపర్చుకుని సుందరీకరణ చేపట్టాలి

–వెంకట్‌రెడ్డి, కర్మన్‌ఘాట్

మినీ ట్యాంక్ బండ్ తరహా తీర్చిదిద్దాలి..



రాత్రి, ఉదయం వేళల్లో పరిసర కాలనీ వాసులు చెరువు కాళీ స్థలాన్ని చెత్త డంపింగ్ కేంద్రంగా మారుస్తున్నారు. మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిల్వ ఉంటున్నాయి. దీంతో పందులు, దోమలకు ఆవాసాలుగా మారి పరిసర కాలనీవాసులకు అనారోగ్య వాతావరణాన్ని పంచిపెడుతుంది. చెరువుకు ఔట్‌లెట్ కల్పించడంతో పాటు ఆక్రమణదారుల చెరలో ఉన్న స్థలాన్ని స్వాధీనం చేసుకుని మినీ ట్యాంక్ బండ్ తరహా తీర్చిదిద్దాలి.

–సునీల్, కర్మన్‌ఘాట్, శుభోదయ కాలనీ

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ. 35, వంకాయ రూ. 35, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 48, బీర రూ. 50, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 70, క్యారెట్ రూ. 45, దొండ రూ. 43–45, చిక్కుడు రూ. 80, గోకర రూ. 45, బీట్‌రూట్ రూ. 28, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 38, దోస రూ. 18, సొర రూ. 17, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 54, చామగడ్డ రూ. 39. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నియామకం

వనస్థలిపురం: భీమ్ ఆర్మీ తెలంగాణ రాష్ట్ర కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎల్‌బీనగర్‌కు చెందిన కొంగరి అశోక్ నియమితులయ్యారు. ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి అశోక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో భీమ్ ఆర్మీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం



నరేందర్‌రెడ్డి

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధి కొలను శివారెడ్డి నగర్ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొలను నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొలను దేవేందర్‌రెడ్డి, జి.నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా సీహెచ్.మహేష్, జాయింట్ సెక్రటరీగా సీహెచ్.శ్రీనివాసారెడ్డి, ఐతరాజు రాజు, కోశాధికారిగా చంద్రయ్య, సభ్యులుగా నాగభూషణం, వెంకట్‌రెడ్డి, కేశవరెడ్డి, యాకుబ్ రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, వెంకటేష్, సురేందర్ రెడ్డి, లింగరాజు, నర్సింహా ఎన్నికైనట్లు అధ్యక్షుడు కొలను నరేందర్‌రెడ్డి తెలిపారు.

ఆహ్వానం



చంపాపేట: ఈ నెల 29న కర్మన్‌ఘాట్‌లో జరిగే ప్రైవేట్ టీచర్ల సన్మాన సభకు రావాలని రాష్ట్ర టీపీయూఎస్ అధ్యక్షుడు అజయ్ కార్తీక్ కర్మన్‌ఘాట్ ఆల్ఫా హైస్కూల్ ప్రిన్సిపల్ తయ్యబాసుల్తానాను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ..ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో భాగంగా టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఎంపిక చేయబడిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు పావని, అస్రా తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మూసారంబాగ్ డివిజన్ సలీం నగర్ కమ్యూనిటీహాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజవర్గ పరిధిలో డివిజన్ల వారీగా కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 50 మందికి కుట్టు మిషన్లు, సర్టిఫికేట్లు అందజేసినట్లు వెల్లడించారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

నాగోలు: ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరమని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రామ్ రెడ్డి అన్నారు. ఆదివారం నాగోలు సాయినగర్ అల్కాపురి చౌరస్తా సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన విల్ పవర్ జిమ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిత్యం వ్యాయామం చేయడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. నిపుణుల పర్యవేక్షణలో వ్యాయామాలు నేర్పిస్తామని నిర్వాహకులు సైదులు, వంటిపాక వినయ్ కుమార్ తెలిపారు. జిమ్ ప్రారంభం సందర్భంగా యోగా, జుంబా క్లాసులు ఉచితమన్నారు. ఈ కార్యక్రమంలో అనంతుల కాలనీ అధ్యక్షులు అనంతుల సురేందర్ రెడ్డి, ఐలయ్య, శివచరణ్ రెడ్డి, బండ సురేందర్ రెడ్డి, ప్రసాద్, బాబ్జీ, రంగారెడ్డి, గోల్కొండ మైసయ్య పాల్గొన్నారు.



జిమ్‌ను ప్రారంభిస్తున్న మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత



జయంతి వేడుకల్లో పాల్గొన్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: జడ్జెస్‌కాలనీ ఫేజ్–1లోని శివాజీ పార్కు సమీపంలో వీరశైవ లింగాయత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీవసుంధర రత్న రాష్ట్రీయ సంత్ సద్గురు డాక్టర్ శివలింగ శివాచార్య మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ సోమలింగం శివాచార్య మహారాజ్, బ్రహ్మశ్రీ శివానంద శివాచార్య మహారాజ్, బ్రహ్మశ్రీ మల్లికార్జున శివాచార్య మహారాజ్ హాజరై ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరమ్మయాదవ్, నాగరాజు, రామేశ్వర్, కృష్ణారెడ్డి, పాటిల్ మారుతి కసర్లికర్, రాచప్ప, హన్మంతు, శివాజీ, రాజు డోంగ్లీకర్, బాలాజీ అంగాడీ, శివరాజ్, కమలాకర్, ప్రకాష్, యోగేష్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



యజ్ఞ కార్యక్రమానికి వెళ్తున్న సంఘం సభ్యులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గౌతంనగర్‌లోని స్వర్ణకార వీధిలో విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఉప్పల్ భగాయత్‌లో జరిగిన యజ్ఞ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ స్వామి ఆలయ చైర్మన్ నర్సింహాగుప్తా, బీసీ సమాఖ్య అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, రచయితల సంఘం అధ్యక్షుడు భైరి శంకర్, మాజీ కౌన్సిలర్ వెంకటేశ్‌యాదవ్, నాయకులు శ్రీశైలం యాదవ్, సన్నీయాదవ్, రమేష్ ముదిరాజ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సత్యం చారి, కోశాధికారి రవిచారి పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుడి నిమజ్జనం



పూజలో పాల్గొన్న పటోళ్ల కల్యాణ్, అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: వినాయడిని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కుమారుడు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు కల్యాణ్, బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని జైరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనం శనివారం రాత్రి నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా వాసవీకాలనీకి చెందిన గణనాథుడి మొదటి లడ్డూ దామోదర్ రూ.8లక్షలు, రెండవ లడ్డూ సుకుమార్ రూ. 4.50 లక్షలు, మూడవ లడ్డూ సంజన రూ. 3.72 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో జైశ్రీరామ్ సేవా సమితి ప్రతినిధులు ప్రీతం, వెంకట్, శేఖర్ పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి

నాగోలు: పాత కక్షలతో ఓ యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం గౌరెల్లికి చెందిన చెంచల శివాజీ(28), అదే గ్రామానికి చెందిన కొమ్ము వినోద్ కుమార్(30)కు పాత గొడవలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి గణేష్ నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న సమయంలో వినోద్ కుమార్‌పై శివాజి చిన్న పేపర్ కట్టింగ్ కత్తితో దాడి చేయడంతో మెడ, కడుపు, పొట్ట భాగంలో కత్తిపోట్లు పడ్డాయి. స్థానికులు గమనించి వినోద్‌ను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వినోద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వినోద్‌కుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్స్ కుటుంబాలకు హెల్త్ పాలసీ ప్రకటించాలి

ముషీరాబాద్: బ్యాంకు ఉద్యోగస్తుల పెన్షనర్స్ కుటుంబాలకు హెల్త్ పాలసీని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ ఎంఎం భాస్కర్‌రావు కోరారు. ఆదివారం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాహ్నవి కళాశాల ఆవరణలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 130 మంది యూనియన్ బ్యాంకుతో పాటు పలు బ్యాంకులలో ఉద్యోగ విమరణ పొందిన పెన్షనర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, డెంటల్, కంటి, గుండె సంబంధిత పరీక్షలను యశోదా ఆసుపత్రి, మ్యాక్స్ విజన్, ఓరోగ్లీ ఆసుపత్రుల డాక్టర్ల సహకారంతో నిర్వహించుకున్నారు. అలాగే హెల్త్ ఇన్సురెన్స్‌పై డాక్టర్ ఏ.శరత్‌కుమార్ ఎస్సూర్ డాట్ కామ్ ప్రతినిధులు అరవింద్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏవీ రమణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏ.కృష్ణారెడ్డి, కోశాధికారి బీఎస్.అనంతరామ్, గుడిసెల బక్కయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.